నిస్త్రాణే కలిగేది. ఇవాళా అదే...

తాను పని ముగించాడా...భగవంతుడికి సరియైన శ్రుతి శుద్ధమైన వేణువును పంపాడా....

ఇన్ని సంవత్సరాలు కృషిచేసి ఇన్ని వేల పరీక్షలు జరిపి, చివరికి పంపిన వేణువును పరీక్షించుకోలేదు. అది కృష్ణయ్యకే వదిలేశాడు. శ్రుతి సరిలేకపోతే ఆయనే సరిచేసుకొంటాడు.

అయినా శ్రుతి శుద్ధంగా ఉందో లేదో నిర్ణయించే జ్ఞానం తనకు ఉందా....సరిచేసే శక్తి ఆయనకు లేదని తను అనుకొన్నాడా? గోపన్నకు నవ్వు వచ్చింది...

ఎంత పొరబాటు...పాతికేళ్ళ పొరబాటు....ఒక జీవితం పొరబాటు. ఆయన అలుగుతాడా...అలగడు. నవ్వుకుంటాడు. వెర్రిగోపన్న అనుకొంటాడు. అనుకొని మురళిని తన పెదిమల దగ్గర ఉంచుకుంటాడు. శ్రుతులన్నీ దాచుకున్న బొజ్జలోంచి ఓంకారానికి మూలస్థానమైన నాభిలోంచి మంగళ గళంలోంచి మధురాధరాలలోంచి....

వెన్నా పాలూ ఆరగించిన మధురాధరాలలోంచి. రాధాధరాలను పవిత్రం చేసిన మధురాధరాలలోంచి జీవం వచ్చి తన వేణువులో ప్రవేశిస్తుంది...

తన పక్కనున్న వేణువులోంచి సన్నటి చక్కటి స్వరం నెమ్మదిగా ఇవతలికి రావడం, వచ్చి తన చెంప నిమరడం గమనించాడు గోపన్న.

ఇదేమిటి! తను పనికి రాదనుకున్న మురళి....

ఇంకో క్షణానికి ఆ పక్క మురళి ఉత్తర క్షణార్థానికి ఇటుపక్క మురళి మేలుకున్నాయి. మరికొద్ది క్షణాలలో ఆ కుటీరంలో సహస్ర వేణువులూ భువన మోహనంగా గానం చేయసాగాయి. గోపన్న లేచి కూర్చున్నాడు. భ్రమరాన్ని చూస్తున్న కీటకంలా దశదిశలా పరిభ్రమించాడు. అన్ని వేణువులూ పాడుతున్నాయి. అన్నిటిలోనూ అలనాటి బృందావన కృష్ణుడి మోహన గానమే. అన్నీ శ్రుతి శుద్ధంగా ఉన్నాయి. అసత్యమైన వేణువు లేనేలేదు. భగవంతుడికి ఉపయోగపడని వేణువేలేదు...

గోపన్న విభ్రాంతుడైపోయాడు.

నీరసంగా ఆనందంగా మేనువాల్చాడు. సహస్ర వేణునాద స్వరార్ణవంలో-సాక్షాన్మహావిష్ణువై తేలుతున్నాడు...

వేణుగానం ముగిసిన కొద్ది క్షణాలకు అంతకన్న మధురమైన అడుగుల సవ్వడి వినబడింది. చిన్న గోపన్న వచ్చి వుండాలి. తను పంపిన మురళి మంచిదో కాదో చెప్తాడు. ఈ సత్యం ఇక తెలిసినా మానినా ఒకటే. అంతకన్న గొప్ప సత్యాన్ని దర్శించాడు గోపన్న.

గోపన్న నెమ్మదిగా కళ్లు తెరిచాడు.

గుమ్మంలో బాలకృష్ణుడు!

పట్టుపంచ పట్టుధట్టీ కస్తూరిబొట్టు బుగ్గన చుక్క సిగలో పింఛం...

“నువ్వే వచ్చావా కిష్టయ్యా...” అంటూ లేచి కూర్చుని చేతులు జోడించాడు గోపన్న.

“అయ్యా అయ్యా, కిష్టయ్య నీ మురళి వాయించాడే. నాకు బువ్వ పెట్టాడు. ఇక్కడ ముద్దెట్టుకున్నాడు. అయ్యా మరేం...కిష్టయ్య నీ మురళి వాయించేవాడే. కానీ... మరే...ఎంత వాంచినా ఏమీ వినబడలే. అస్సలు పాట రాలేదే..కాని కిష్టయ్య మంచోడు. నన్నిక్కడ ముద్దెట్టు...”

గోపన్న తల పక్కకు తిప్పి గదినిండా పడివున్న వేణువులను చూశాడు.

ఇంతసేపూ గానం చేసి అలసిపోయిన వేణువులవంక ఆప్యాయంగా సగర్వంగా చూసి ఒకటి తీసి ముద్దు పెట్టుకున్నాడు గోపన్న.

# వయోవృద్ధులూ హలో! హలో!! 17

## గుండెపోటు



**ప్రొఫెసర్, డా. పి.తిరుమలరావు**

263/3 ఆర్‌టి, సంజీవరెడ్డినగర్,
హైదరాబాద్-500 038
ఫోన్: 270 263

మనిషి సునాయాస మరణాన్ని కోరుకోవచ్చు. కానీ అకాల మరణాన్ని కోరుకోకూడదు. ఉధృతంగా గుండెపోటు వస్తే మనిషి కొన్ని నిముషాల లోనే ప్రాణాన్ని విడుస్తాడు. ఇది ఆలోచించడానికి సునాయాస మరణంగానే కనిపించవచ్చు కానీ ఇది బాధాకరమైన మరణం. ఇలాంటి మరణాన్ని కొని తెచ్చుకోకూడదు. మరణాన్ని సాధ్యమైనంతలో జయించాలి, యముడి చేతిలోని పాశానికి దొరకకుండా తప్పించుకోవడమే వివేకవంతుడి లక్షణం. ఈ విషయంలో ఎలాంటి ప్రయత్న లోపమూ వుండకూడదు.

మనిషికి గుండెపోటు రావడానికి ముఖ్య కారణాలు రెండు: ధూమపానం, మధుసేవనం. అంతేకాదు, అమితంగా కొవ్వువదార్థాలు వున్న ఆహారం తీసుకోవడం, లావెక్కడం, మానసిక వత్తిడికి గురికావడం, లక్ష్యంలేని విచ్చలవిడి జీవితం- హృద్రోగాలకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితిని తప్పించుకోవడానికి అమెరికా వంటి దేశాలలో ప్రయత్నాలు మొదలయ్యాయి. అక్కడ సిగరెట్లు తాగటానికి వ్యతిరేకంగా వుద్యమాలు వచ్చాయి. సిగరెట్ల ఎడ్వర్టయిజ్‌మెంట్లు పత్రికలలో ప్రచురించడాన్ని నిరోధించారు. దీనితో కొందరైనా హృద్రోగాల బారినుంచి తప్పించుకునే అవకాశం ఏర్పడింది. ఇది మిగతా దేశాలు కూడా అనుసరించతగ్గ మార్గం.

కొందరు తమ ఆరోగ్యాలను లెక్కచేయరు. రోగం వస్తే డబ్బుతో కుదుర్చుకోవచ్చులే అన్న ధీమాతో వుంటారు. ఇలాంటి వారికి గట్టి ఎదురు దెబ్బలే తగులుతుంటాయి. ఒకసారి ఆరోగ్యం పాడైన తర్వాత ఎంత ఖర్చుపెట్టి బాగుచేయించుకున్నా అది తాత్కాలికమే అవుతుంది. చాపకింద నీరులా రోగం ముదురుతూనే వుంటుంది. అందువల్ల డబ్బు వల్లే ఆరోగ్యం బాగుపడుతుందన్న భ్రమలు వదులుకోవాలి. ఆరోగ్యానికి చేటు కలిగించే అలవాట్లను మానుకోవాలి. జీవితాన్ని ఆరోగ్యవంతమైన వాతావరణంలో నడుపుకోవాలి.

మనం నిత్యం జవజీవాలతో తొణికిసలాడాలంటే హృదయం, ఊపిరితిత్తులు ఆరోగ్యవంతంగా వుండాలి. ఇవి పనిచేసే విధానాన్ని కొంచెం తెలుసుకోవలసిన అవసరం వుంది. గుండె దేశంలోని రక్త ప్రవాహానికి ప్రధాన వాహికగా వుంటుంది, కేంద్రంగా కూడా వుంటుంది. రక్తాన్ని ఊపిరితిత్తులలోని ప్రాణవాయువుతో మిళితం చేసి దేహమంతటికీ పంపుతుంది. ఆరోగ్యవంతుడి గుండె నిముషానికి 72సార్లు కొట్టుకుంటుంది. ఇలా కొట్టుకోవడం వల్ల దేహంలోని రక్తప్రవాహాన్ని క్రమబద్ధం చేస్తుంది. అందువల్ల హృదయ సంబంధ వ్యాధులు వచ్చినట్టు గ్రహించగానే వైద్యుని సంప్రదించడం అత్యవసరం.

మనం వ్యాయామం చేసేటప్పుడు, పరిగెత్తినప్పుడు గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఈ గమనం త్వరలోనే క్రమబద్ధమవుతుంది. అలా సర్దుకోకపోతే డాక్టర్‌ని సంప్రదించడం మంచిది. గుండెకు రక్తం చేరవేసే ప్రధాన వాహికను కరోనరీ ఆర్టరీస్ అంటారు. దీనిలో ఎక్కడైనా అవరోధం ఏర్పడితే ఇలా జరగవచ్చు. లేదా ఎక్కడైనా రక్తం గడ్డకట్టి అడ్డు ఏర్పడితే గుండెపోటు రావచ్చు. గుండెకు చేరవలసిన బలం చేరకపోతే కండరాలు బలహీనపడి ఇలా జరగవచ్చు. గుండె నొప్పి మొదట వచ్చినప్పుడు ఎడమ గూడులోనూ, ఎడమ చేయిపై భాగంనుంచి మోచేయి వరకూ లేదా అరచేతి వరకూ నొప్పి వస్తుంది. ఈ నొప్పి తీవ్రంగా వున్నప్పుడు ముచ్చెమటలు పోస్తాయి. మనిషి నిలుచునే శక్తిని కోల్పోయి కూలబడిపోవచ్చు. ఇలా జరిగినప్పుడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలి. లేకపోతే నొప్పి తీవ్రమై ప్రాణాలకే ముప్పు ఏర్పడవచ్చు.

ఇక ఊపిరితిత్తుల విషయానికి వస్తే- మన శ్వాస మొత్తం వీటివలనే జరుగుతుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నిముషానికి సుమారు 18 సార్లు జరుగుతుంది. ఊపిరితిత్తుల వల్ల, శ్వాసక్రియ వల్ల నిత్యం అనుక్షణం మన రక్తం శుభ్రపడుతుంది. రక్తంలోకి ప్రాణవాయువులు చేరి కొత్త జీవం దేహంలోకి ప్రవేశిస్తుంది. మనం తీసే ఊపిరికీ మన ఆయుప్రమాణానికీ సంబంధం వుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందువల్ల మన వూపిరిని ప్రాణాయామం చేత బంధించి కంట్రోలు చేయగలిగితే ఆయుష్షను పెంచుకున్నట్టేనని యోగా చెబుతోంది. ఇదే యోగాలోని ప్రత్యేకత. మనం భూమి మీద పుట్టినప్పుడే మన ఆయుష్షును దేవుడు నిర్ణయిస్తాడని ఒక నమ్మకం ప్రచారంలో వుంది. ఒక వేళ దేవుడిని నమ్మకపోయినా సైన్సు కూడా సుమారుగా ఇలాంటి విషయాన్నే చెబుతోంది. మన జీన్స్(ప్రాణబీజాలు)లోనే మన ఆయుప్రమాణం నిర్ణయింపబడి వుంటుందట! అందుకే కావచ్చు ఎవరైనా చనిపోతే- ‘అతని ఊపిరి ఆగిపోయింది’ అంటాం. అంతేకానీ, గుండె ఆగిపోయింది అని సంబోధించం.

అందుకే మన శాస్త్రాలను ఆధారం చేసుకుని, ప్రాణాయామం ద్వారా ఆయుప్రమాణాన్ని కొలిచి, నిర్ణయించి ‘పతంజలి’ లోకానికి చాటాడు. దీనిని పాశ్చాత్య దేశాలలో కూడా అంగీకరించారు. ఈ విధానాలను మన రుషులు ప్రయోగించి చూశారు. మనం ఎంత బలహీనంగా వున్నా కేవలం ఊపిరి ఆధారంగానే మనం యోగాసాధనను చేయవచ్చును. అందువల్ల ఇది వృద్ధులకు మరింత ప్రయోజనకరమని చెప్పగలను. పాశ్చాత్య దేశాలలోని మహేష్ యోగి మొదలైన వారు ఇస్తున్న శిక్షణ ఇదే. యోగా మనకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుందనడంలో ఎలాంటి సందేహాలు అక్కరలేదు.